నందన, పుట : 45-48, జి. రామలక్ష్మి - హైదరాబాదు

## ఉల్లి చేసిన మేలు

క్షోణపురాన్ని విజయసేనుడు అనే రాజు పరిపాలించేవాడు. ఆయనకు ఒక్కర్తే కుమార్తె. ఆమె పేరు శశిరేఖ.

ఒకసారి ఆ రాజుకు జబ్బుచేసింది. ఎందరో రాజవైద్యులు వచ్చి వైద్యముచేశారు. కానీ జబ్బు నయమవలేదు. ఎంతో మంది వైద్య శాస్త్రవేత్తలు పరీక్షించారు. కానీ జబ్బేమిటో తెలుసుకోలేకపోయారు. కొంతమంది వైద్యులు ప్రతిక్రియలు చేశారు. కానీ లాభము కలగలేదు. అందరూ ఇంక రాజు బ్రతుకడని ఆశ వదులుకున్నారు.

చివరికి మంత్రి సలహామీద రాజు, "తన జబ్బు నయముచేసినవారికి తన కుమార్తెను ఇచ్చి వివాహముచేసి, తన రాజ్యానికి పట్టాభిషేకము చేస్తా" నని ప్రకటన వేయించాడు.

ఆ ప్రకటన విని ఎవ్వరూ ముందుకురాలేదు.

కొందరు, "మహా మహా వైద్యులే జబ్బు నయము చేయలేకపోయినప్పుడు యింక మనము మాత్రం ఏం చెయ్యగలం?" అని తగ్గిపోయారు.

కానీ ఆ దేశంలోనే ఒక చిన్న గ్రామంలో శేఖరుడు అనే యువకుడున్నాడు. అతడు చాలా అందగాడు, గొప్ప తెలివైనవాడుకూడా. అతడన్ని విద్యలలో ఆరితేరినవాడు, కొద్దిగా వైద్యములో అనుభవమున్నవాడు.

అతడు రాజుగారి ప్రకటన విని, వెంటనే రాజభవనానికి వచ్చాడు.

"మీ జబ్బు నేను నయంచేస్తాను" అన్నాడు శేఖరుడు రాజుతో.

నిరాశచెందియున్న రాజు సంశయిస్తూనే, ఇదీ కూడా చూద్దాం అనుకుని, "సరే" నన్నాడు.

"కానీ చిన్న మనవి మహారాజా!" అన్నాడు శేఖరుడు.

"ఏమిటది?" అన్నాడు రాజు.

“అదే ... నేను ఇచ్చే మందు మీరు తప్పక పుచ్చుకోవాలి. ఎట్టి పరిస్థితులలోనూ మాట తప్పకూడదు.” అన్నాడు శేఖరుడు.

దానికి రాజు ఒప్పుకున్నాడు.

తరువాత శేఖరుడు రాజుగారి జబ్బును పరీక్షించాడు. రాజుగారి కడుపులో నారీకురుపున్నదనీ, ఆ నారీకురుపు నారీపురుగువలన వచ్చిందనీ, నారీపురుషు చస్తేగాని నారీకురుపు తగ్గదనీ అది తగ్గకపోతే రాజుగారి వ్యాధి తగ్గదనీ గ్రహించాడు.

నేనిచ్చే మందు రాజుగారు తింటారా! తినకపోయినట్లయితే వ్యాధి తగ్గదు. ఐనా మాట యిచ్చారుగా, తింటారు అనుకున్నాడు తనలో.

వెంటనే తన సంచిలో నుంచి ఒక ఉల్లిపాయను తీశాడు.

రాజు ఆశ్చర్యంగా చూడసాగాడు.

ఆ ఉల్లిపాయను ముక్కలుగా చేసి, దానిని రాజుగారికిచ్చి, “తినండి” అన్నాడు.

రాజుగారు శేఖరుడివంక తీక్షణంగా చూసి, “అదేమిటి? ఉల్లిపాయను తినమంటున్నావు? క్షత్రియుడనైన నాకు ఉల్లిపాయ నిషేధముకదా! నేను తినను” అన్నాడు.

అది విని శేఖరుడు, “మహారాజా! మీరు మాట తప్పుతున్నారు. ప్రాణాపాయ సమయమున యిది నిషేధముకాదు. ఇది ఔషధములాంటిది.” అని రాజును ఒప్పించి, తిష్యరక్షిత ఉల్లిపాయను తినిపించాడు.

అలా మూడురోజులు రాజుకు ఉల్లిపాయను తినిపించాడు శేఖరుడు.

ఉల్లిపాయను తినగానే మూడవ రోజుకు రాజుగారి కడుపులో నారీపురుగు నశించింది. మరి మూడు రోజులకు నారీకురుపుకూడ తగ్గి, రాజుగారు ఆరోగ్యవంతుడయ్యాడు.

రాజుగారు ఆరోగ్యవంతుడయినందులకు అందరూ ఎంతగానో సంతోషించారు.

ఉల్లిపాయతో రాజగారి జబ్బును నయం చేసిన శేఖరుడ్ని రాజుగారేగాక, అందరూళి సంతోషించి ఎంతో పొగిడారు.

అందుకే అంటారు, "ఉల్లి చేసిన మేలు" తల్లి కూడా చేయదని.

తరువాత రాజుగారు అన్న మాట ప్రకారం తన కూతురు శశిరేకను శేఖరునికిచ్చి అతి వైభవముగా పెళ్ళి జరిపించాడు.

తరువాత పట్టాభిషుక్తుణ్ణిచేసి శేకరుడికి తన రాజ్యాన్ని అప్పగించాడు.

శేఖరుడు తన భార్యయగు శశిరేఖతో సుఖముగా కాలం గడుపుతూ, క్షోణపురాన్ని ఏలుకొంటూ హాయిగా జీవించాడు.